క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్

ధర్మారం: మండలంలోని కొత్తూరు, రామయ్య పల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ తాళ్లపెల్లి లింగయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుడు మాజీ సర్పంచ్ మద్దెల నర్సయ్యతోపాటు ఆయన అనుచరులు కాంగ్రెస్‌లో చేరాఉఉ. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌కు చెందిన నేరువట్ల కిరణ్, దుర్గయ్య, రవి, రాజయ్య, ఓదయ్య, టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి భూక్య రాజేశంనాయక్, శివకుమార్ కాంగ్రెస్‌లో చేరారు. మండలంలోని రామయ్యపల్లికి చెందిన మాజీ వార్డు సభ్యులు నలుగురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా వారిని లక్ష్మణ్‌కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ



స్తంభాలను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

రామగుండం: ఇటీవల వీచిన ఈదురుగాలులతో అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి ఎస్సీ కాలనీలో నాలుగు విద్యుత్ స్తంభాలు వంగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అప్పటికే అప్రమత్తంగా ఉన్న ఏఈ ఆశ శంకర్ ప్రత్యామ్నాయంగా మరో ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేయించారు. వంగిపోయిన నాలుగు స్తంభాలను బుధవారం పునరుద్ధరించి విద్యుత్ సరఫరాను మెరుగుపరిచారు. ఈ పనులను ప్రత్యక్షంగా డీఈ ఈశ్వరప్రసాద్ పర్యవేక్షించారు.

తాగునీటి సరఫరాపై ఆరా



పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు, పెద్దాపూర్ గ్రామాల్లో మిషన్ భగీరథ అధికారులు పర్యటించి తాగేనీటి సరఫరాపై అడిగి తెలుసుకుని పైపులైన్లను పరిశీలించారు. భగీరథ ఈఈ పూర్ణచందర్, ఇంట్రాలైన్ ఈఈ శ్రీనివాస్‌లు పర్యటించి తాగునీటి సరఫరాలో ఇబ్బందులు, మరమ్మతులు, బోర్‌వెల్‌ల పరిస్థితిని తెలుసుకున్నారు. ఎంపీడీవో పద్మజ, ఏఈ గ్రిడ్ సంపత్, భగీరథ ఏఈ సువిశాల, ఎంపీవో కిరణ్, పంచాయతీ కార్యదర్శి లచ్చయ్య ఉన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పరిశీలన



అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూర్–దస్తగిరిపల్లి గ్రామాల మధ్య గల అండర్‌బ్రిడ్జి వద్ద ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎంపీటీసీ మిట్టపల్లి వసంత, నాయకుడు వెంకటేశం రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. బుధవారం అండర్‌బ్రిడ్జి వద్ద వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు పడుతున్న అవస్థలపై ఆరా తీశారు. వీలైనంత త్వరగా అండర్ బ్రిడ్జి వద్ద మరమ్మతు పనులు చేపట్టి సమస్యకు పరిష్కారం చూపాలని కోరినట్లు ఎంపీటీసీ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

జూలపల్లి: అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిసిన రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తడిసిన ధాన్యం కొనేందుకు కృషి చేస్తానని ఎంపీపీ రమాదేవి పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అకాల వర్షంతో వడ్లు తడవగా బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డితో కలిసి జూలపల్లితో పాటు పెద్దాపూర్, వడ్కాపూర్ కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాడెం మల్లారెడ్డి, నాయకులు కొండపల్లి కృష్ణమూర్తి, తొగరు శ్రీనివాస్, మద్దెల నరేశ్, గుమ్మడి రాజిరెడ్డి, కూసుకుంట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మ రాజు, దాడి నాగరాజు, పాశం మల్లయ్య ఉన్నారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోండి

- జిల్లా సహకార అధికారి శ్రీమాల



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీవో శ్రీమాల

మంథని: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, అకాల వర్షాలకు తడవకుండా తగు చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా సహకార అధికారి శ్రీమాల అన్నారు. మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మంథని మున్సిపల్ పరిధిలోని మార్కెట్ యార్డు, శ్రీరాంనగర్, గంగాపురి, మండలంలోని ఎక్లాస్‌పూర్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం తడవకుండా ఉండేలా అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు రికార్డుల్లో నమోదు చేయడంతో పాటు ట్యాబ్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం మంథనిలోని సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించి సంఘం ద్వారా చేపడుతున్న వ్యాపారాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సహకార శాఖ సూపరింటెండెంట్ సువర్ణతో పాటు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



మంథని: కండువా కప్పుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: మంథని నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. పార్లమెంట్ ఎన్నికల వేళ కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు కొనసాగుతున్నాయి. మంథని మున్సిపల్ పరిధిలోని 7వ వార్డుకు చెందిన సుమారు 200 మంది విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే శ్రీశివునాగపురి పోచమ్మవాడకు చెందిన రావుల లింగేశంతో పాటు 60 కుటుంబాలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని కాకర్లపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఇసంపల్లి మహేందర్‌తో పాటు, వార్డు సభ్యులు, నాయకులు సుమారు 40 మంది పార్టీలో చేరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ, వైస్ చైర్మన్ సీపతి బానయ్య, జిల్లా అధికార ప్రతినిధి ఇనుముల సతీశ్, ప్రచార కమిటీ కన్వీనర్ వొడ్నాల శ్రీనివాస్, ఎంపీపీ కొండ శంకర్, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఉన్నారు.

రామగిరి: మండలంలోని బేగంపేటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లకార్తి మల్లయ్యతో పాటు పలువురు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. కాగా వారికి మంత్రి శ్రీధర్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం బీఆర్ఎస్ పెద్దంపేట గ్రామ మాజీ ఎంపీటీసీ సుందిళ్ల నాగరాజు తన అనుచరులతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. శ్రీధర్‌బాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకర పోతరాజు, రైతు కమిటీ అధ్యక్షుడు సమ్మయ్య, శ్రీనివాస్, హరీశ్, సంజీవ్, అభిలాష్, జగదీష్ ఉన్నారు.

అధైర్య పడకండి.. ఆదుకుంటాం



ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: అన్నదాతలారా అధైర్య పడకండి ఆదుకుంటాం అంటూ అకాల వర్షానికి వడగండ్లకు పంట నష్టపోయిన రైతులకు పెద్దపల్లి ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. మంగళవారం రాత్రి వడగండ్ల వర్షానికి మండలంలోని ఐకేపీ, సింగిల్‌విండో కొనుగోలు కేంద్రాల్లో, కల్లాల్లో తడిసిన వరిధాన్యం కుప్పలను, మామిడి తోటల్లో నేలరాలిన మామిడి కాయలను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. వర్షానికి కొట్టుకుపోయిన వరిధాన్యం, నేలరాలిన మామిడి కాయలను రైతులు ఎమ్మెల్యేకు చూపించారు. తమకు సర్కార్ పరిహారం అందించి ఆదుకోవాలని, తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అకాల వర్షానికి, వడగండ్లతో పంట నష్టపోయిన రైతుల జాబితా వెంటనే తయారు చేసి తనకు అందించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే రైతులకు భరోసా ఇచ్చారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మాజీ సర్పంచులు తులా మనోహర్‌రావు, మాదాసు సతీశ్, నాయకులు సబ్బని రాజమల్లు, శ్రీనివాస్, దేవేందర్, బాజిరెడ్డి, మొండయ్య, సాగర్, కొమురయ్య, శ్రీకాంత్ ఉన్నారు.

రాజకీయ పార్టీలతో ఆర్డీవో సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమానాయక్

మంథని: పార్లమెంట్ ఎన్నికలపై నియోజకవర్గంలోని తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంథని ఆర్డీవో హనుమా నాయక్ బుధవారం సమావేశమయ్యారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, ఇతర అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఈ నెల 10 వరకు పొడగించినట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

ఆదరించండి.. ఎంపీగా గెలిపించండి



రామగిరి: ఓట్లు అభ్యర్థిస్తున్న కొప్పుల ఈశ్వర్

రామగిరి: 'కార్మికుల కష్టాలు తెలిసినవాడిని, మీ అందరిలో ఒకడినైనా నన్ను ఆదరించి పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిపించాలి' అని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కార్మికులను కోరారు. బుధవారం ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏ గనిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు శంకేశీ రవీందర్, నాయకులు నాగెల్లి సాంబయ్య, మ్యాదరబోయిన కుమార్, కాపురబోయిన భాస్కర్, ఇసంపల్లి రమేశ్, గండి శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

ఎలిగేడు: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలం కేంద్రంలోని మధుర ఫంక్షన్‌హాల్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఎంపీపీ తానిపర్తి స్రవంతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, తానిపర్తి మోహన్‌రావు, కమలాకర్‌రెడ్డి రాచర్ల కొండయ్య, వేణుమాధవరావు, తిరుపతి, బాపయ్య, పోచయ్య, ప్రవీణ్, రాజేశం, తిరుపతిరెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

అమలు చేయలేని హామీలు ఇస్తున్నారు

జూలపల్లి: అమలు చేయలేని గ్యారంటీలతో, అబద్ధపు పునాదుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని జెడ్పీచైర్మన్ పుట్ట మధుకర్ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఆధ్యక్షతన ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీపీ రమాదేవి, వైస్ ఎంపీపీ రమేశ్, ఎంపీటీసీలు మల్లేశ్‌యాదవ్, శ్రీనివాస్, చుక్కారెడ్డి, వెంకటేశం, రవీందర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి ఉన్నారు.

రామగుండం: రామగుండం పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. శివరాత్రి గంగాధర్, అత్తరొద్దీన్, ఆసాది వేణుగోపాల్, సాయి, జస్వంత్, సాయికృష్ణ, అశ్వంత్, ప్రశాంత్, ప్రణయ్ ఉన్నారు.

మంథని: అబద్ధాలు చెప్పి మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి, నాయకులకు అలవాటుగా మారిందని జెడ్పీచైర్మన్ పుట్ట మధు విమర్శించారు. బుధవారం మంథని మండలం గుంజపడుగులో ఉపాధిహామీ కూలీలను కలిసి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సుల్తానాబాద్: పట్టణం, మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ హాజరై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీపీ బాలాజీరావు, రైతు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ పాల రామారావు, జిల్లా నాయకులు మనోజ్‌గౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, రాజమల్లు, గొట్టం మహేశ్, వెంకటేశ్, బాపూరావు, సందీప్‌రావు పాల్గొన్నారు.

రామగిరి: ఆచరణలో అమలుకాని హామీలతో ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకేశీ రవీందర్, ఏఎంసీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని రత్నాపూర్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు.

పాలకుర్తి: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కోరారు. బుధవారం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జెడ్పీచైర్మన్ పుట్ట మధుకర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కార్మికసంఘం నాయకులు కౌశికహరి, అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ, పాలకుర్తి వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, పార్టీ మండలాధ్యక్షుడు ఇంజపూరి నవీన్, మండల కోఆప్షన్ మెంబర్ సర్వర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్‌ను గెలిపించాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి కోరారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి బలపరుస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. నాయకులు ఎంఏగౌస్, సిర్ర మల్లికార్జున్, వొన్నాల లక్ష్మీనారాయణ, జెరిపోతుల దేవయ్య, శ్రీనివాస్, ఏఐఎస్ ప్రకాశ్, జైపాల్‌రెడ్డి, వినయ్, ఆఫీసు కార్యదర్శి రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంతోపాటు నారాయణపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జెడ్పీవైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుకచ నాయకులు నరహరి సుధాకర్‌రెడ్డి, భూర్ల వెంకటసత్యం, భూర్ల సత్యనారాయణ, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, అడ్డగుంట శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఓదెల: కాంగ్రెస్ హయాంలోనే తండాలు అభివృద్ధి చెందాయని పార్టీ మండలం అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లంబాడితండాలో ఇంటింటా కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు నిమ్మ నాయక్, మాజీ ఎంపీటీసీ రాజేశం పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాలలో కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్ లావణ్య ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. నాయకులు సురేశ్, కళారాణి, రాజేశ్వరరావు, విజయ్, రాకేశ్, సంపత్, పోతరాజు, సమ్మయ్య, పోషం, మొగిలి పాల్గొన్నారు.

ముత్తారం: మండలంలోని మచ్చుపేటలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మండల మహిళా అధ్యక్షురాలు గోవిందుల పద్మ ఆనంద్, మాజీ ఎంపీపీ గొర్ల రాజయ్య, మాజీ సర్పంచ్ మేడగోని సతీశ్, నాయకులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలోని ఐదు డివిజన్లలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ఆయా డివిజన్లతో పాటు కాలనీ ఏరియాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 15, 16, 17, 18, 19 డివిజన్ల ప్రజలతో కలిసి ప్రచారం చేశారు. పెద్దపల్లి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, కార్పొరేటర్లు శంకర్ నాయక్, సాగంటి శంకర్ పాల్గొన్నారు.

రామగిరి: మండలంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. నాయకులు తోట చంద్రయ్య, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, స్వరూప, రాధారెడ్డి, ఉమాదేవి, సారయ్య, సందీప్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, మనోజ్, సంపత్, సంపత్, రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి సారించండి



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శంకర్

రామగుండం: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లోని కనీస వసతులపై ప్రత్యేక దృష్టిసారించాలని అంతర్గాం ఎంపీడీవో ఎంఏ.అలీం కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో వాజీద్, ఈజీఎస్ ఏపీవో రమేశ్, ఐకేపీ ఏపీఎం సంది నర్సమ్మ పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు..

ముత్తారం: మండల కేంద్రంలోని ముత్తారం జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం డీఎల్‌పీవో శంకర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని వసతులను పరిశీలిస్తూ స్థానిక అధికారులకు సూచనలు చేశారు. మండల పంచాయతీ అధికారి బైరి వేణుమాధవ్, ఎస్సై మధుసూదన్‌రావు, పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఉన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను బుధవారం ఎంపీడీవో పద్మజ, ధర్మారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. మండల పంచాయతీ అధికారులు ధర్మారం రమేశ్, జూలపల్లి కిరణ్, అంగన్‌వాడీ టీచర్ సత్యమ్మ, కార్యదర్శి తూముల రవి, కారోబార్ మల్లేశం ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఓటరు నమోదు శాతం పెంచాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

జ్యోతినగర్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటరు నమోదు శాతాన్ని పెంచేవిధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని అంబేడ్కర్ భవనంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా స్వశక్తి మహిళలకు అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా గొప్పదని, అర్హులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నరు. 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా ఓటు వేస్తామని స్వశక్తి మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటు విలువ తెలియజేస్తూ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాటలు పాడారు. మెప్మా సీవో స్వరూప, ఆర్పీలు వెన్నెల, శ్రీ సరస్వతి మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

'నియోజకవర్గంలో అభివృద్ధి కానరావడం లేదు'



ప్రచారం చేస్తున్న కందుల సంధ్యారాణి

రామగుండం: రాష్ట్రంలో మార్పు కావాలనుకొని కాంగ్రెస్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి కానరావడం లేదని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి కోరారు. అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి, ముర్మూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పని స్థలాల్లో పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. మండల అధ్యక్షుడు బాణాల స్వామి, మాడ ప్రభాకర్‌రెడ్డి, బొబ్బిలి రాము, దుర్గం రామకృష్ణ, రాజ్‌కుమార్, ఈసరి నర్సయ్య, బర్పటి నారాయణ, హర్ష ఉన్నారు.

ఉపాధిహామీ పనుల వద్ద బీజేపీ ప్రచారం

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట గ్రామంలో ఉపాధిహామీ పనుల వద్ద బీజేపీ నాయకులు కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. నాయకులు కొక్కిరాల దామోదర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, మహేశ్‌గౌడ్, సాగర్, సురేశ్, పర్శరాములు, నరేశ్, శ్రీనివాస్, దేవ రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేత్రదానం

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బీసీకాలనీకి చెందిన తాటిపాముల వెంకటేశ్(46) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. సదాశయ ఫౌండేషన్ పాలకుర్తి మండల అధ్యక్షుడు భీమనపల్లి పృథ్వీరాజ్ వెంకటేశ్ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. కాగా వారు అంగీకరించడంతో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి చెందిన టెక్నీషియన్ రాజన్న సహకారంతో వెంకటేశ్ నేత్రాలను హైదరాబాద్ ఐబ్యాంక్‌కు తరలించారు. మృతుని కుటుంబసభ్యులను సదాశయ ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

బీరన్న–కామరావతి కల్యాణం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని సోమనపల్లి గ్రామంలో బుధవారం కురుమ కులస్తుల ఆరాధ్య దైవమైన బీరన్న–కామరావతి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్ హాజరయ్యారు. ఆమెకు గ్రామ కురుమ ప్రముఖులు స్వాగతం పలికారు. అనంతరం బీరన్న స్వామికి మొక్కులు చెల్లించారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

ఓదెల: ఒక్క అవకాశం ఇస్తే పెద్దపల్లిని అభివృద్ధి చేస్తానని పెద్దపల్లి ఎంపీ ఇండిపెండెంట్ అభ్యర్థి ప్రొఫెసర్ నతానియల్ అన్నారు. బుధవారం మండలంలోని కొలనూర్, ఓదెల, పొత్కపల్లి, మడకతోపాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎన్నికైన ప్రభుత్వాలు ఖనిజ సంపదను దోచుకున్నారని, అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. తనకు అవకాశం ఇస్తే సింగరేణి ప్రాంతంతో పాటు పెద్దపల్లిలో అభివృద్ధి చేస్తానని, నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తానన్నారు. బకెట్ గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు, అంబేద్కర్ సంఘం కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్ఎస్ గెలుపు కోసం మాదిగ యువశక్తి మద్దతు

రామగిరి: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కే మాదిగ యువశక్తి మద్దతు ఇస్తుందని నాయకులు తెలిపారు. బుధవారం సెంటనరీకాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 80 లక్షల మంది ఉన్న మాదిగలకు కాంగ్రెస్ ఒక్క సీటు ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పేద ప్రజల కోసమే పుట్టిందని, రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌కు అండగా ఉంటామని పేర్కొన్నారు. నాయకులు గద్దల శంకర్, బొంకూరి పోచం, గడిపల్లి శ్రీనివాస్, పుల్లూరి తిరుపతి పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

కాల్వశ్రీరాంపూర్: వడగండ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతాంగాన్ని సర్కార్ ఆదుకోవాలని జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరిధాన్యం పరిశీలించిన తిరుపతిరెడ్డి మాట్లాడుతూ అకాల వర్షానికి వరిధాన్యం, మామిడితోటలు నేలరాలడతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు అన్ని గ్రామాల్లో తిరిగి నష్టపోయిన రైతుల జాబితా సిద్ధం చేసేలా సర్కార్ చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరిధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, రైతులు ఉన్నారు.

పోషణ, ఆరోగ్యంపై అవగాహన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారుల తల్లులకు పోషణ–ఆరోగ్యంపై మండల సూపర్‌వైజర్ అంజలి అవగాహన కల్పించారు. ఆదర్శ అంగన్‌వాడీ టీచర్ పెండ్యాల విమల, ఏఎన్ఎం శిరీష, జరీనా, ఆశావర్కర్లు జ్యోతి, స్రవంతి, పుష్పలత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు సత్వర పరిష్కారం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎండాకాలంలో తాగునీటి సమస్యలకు సత్వర పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీవో సుదర్శన్ అన్నారు. మండలంలోని గోపయ్యపల్లిలో బుధవారం పైపులైన్ లీకేజీ పనులను పర్యవేక్షించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించి సూచనలిచ్చారు. పంచాయతీలోని నర్సరీని సందర్శించి మొక్కలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

ఓదెలలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

ఓదెల: మండలంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అయ్యాయి. మంగళవారం కురిసిన వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పారు. బుధవారం ఎండల తీవ్రత మళ్లీ ఎక్కువ కావడంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. మండలంలోని ఓదెల, పొత్కపల్లి, గుంపుల, కొలనూర్, కనగర్తి కేంద్రాల్లో ధాన్యాన్ని హమాలీ వర్కర్లు లోడ్ చేసి రవాణా చేశారు. దీంతో సెంటర్లలోని ధాన్యం కుప్పలు లారీలతో మిల్లులకు రవాణా అయ్యాయి. సంబంధిత శాఖాధికారులు రైతుల ధాన్యం తూకంతో పాటు రవాణా వేగవంతం చేయడంలో నిమగ్నం అయ్యారు. ఐకేపీ సెంటర్లలో ప్రభుత్వం టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఎస్సై ఉదయ్‌కిరణ్

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ ఏరియాలోని పలు లాడ్జీల్లో పోలీసులు తనిఖీ చేపట్టారు. బుధవారం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ ప్రాంతంలో ఎస్సై ఉదయ్‌కిరణ్ తన సిబ్బందితో తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లాడ్జీల్లో గదులను అద్దెకు ఇచ్చే సమయంలో పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో అనుమానిత వ్యక్తులకు గదులను అద్దెకు ఇవ్వొద్దన్నారు. లాడ్జీ కౌంటర్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, అనుమానిత వ్యక్తులు వచ్చిన క్రమంలో పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.